భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (గురు)
సహరి : 4:34 (శుక్ర)



ఏలూరులో వైసీపీ, టీడీపీ నాయకుల వాగ్వాదం

• వైసీపీ యాక్షన్.. డైరెక్షన్

ఏలూరులో వైసీపీ మద్దతుదారులు పింఛన్ల పంపిణీలో చాలాచోట్ల జోక్యం చేసుకున్నారు. పింఛన్‌దారులను ఒప్పించి టీడీపీకి వ్యతిరేకంగా అధికారపక్ష ఛానల్‌లో బురద చల్లించేందుకు డైరెక్షన్ ఇచ్చారు. నూకాలమ్మ గుడి సమీపంలోని సచివాలయం వద్ద ఉదయాన్నే పెద్దఎత్తున పింఛన్‌దారులు చేరుకున్నారు. ఈ సమయంలో పింఛన్లు ఆలస్యం కావడానికి, మండుటెండలో పింఛన్‌దారులు ఇబ్బంది పడటానికి టీడీపీయే కారణమనే నిందలు వేయాలని తదనుగుణంగానే ఛానల్ ఎదుట మాట్లాడాలని కొందరు వైసీపీ నేతలే డైరెక్షన్ ఇచ్చారు. దీన్ని గమనించిన టీడీపీ నాయకులు సచివాలయానికి చేరుకున్నారు. జరుగుతున్న ఈ తంతును ఆంధ్రజ్యోతి చిత్రీకరించటానికి ప్రయత్నిస్తే అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు ఫొటోగ్రాఫర్‌ను తోసివేశారు. సచివాలయ ప్రాంగణంలో అధికార ఛానల్ షూటింగ్ చేస్తుండగా అది బయటకు కనిపించకుండా పోలీసులు అడ్డుగా నిలబడ్డారు. టీడీపీ నేతలు ఈ వ్యవహారాన్ని నిలదీసే ప్రయత్నం చేశారు.

పింఛన్ పడిగాపులు



పాపం.. వృద్ధుల అవస్థలు

సచివాలయాల వద్ద ఉక్కపోతతో వృద్ధుల అవస్థలు

ఎన్నడూ వెళ్ళని సచివాలయాలకు పడుతూ, లేస్తూ పేద జనం బుధవారం ఉదయాన్నే చేరుకున్నారు. ఈ రోజు అయినా పింఛన్ ఇస్తారో, ఇవ్వరోనని సందేహాల నడుమ గంటల తరబడి తీవ్ర ఉక్కపోత, వేడిగాలుల మధ్య వందలాది మంది నిరీక్షించారు. ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తే.. బ్యాంకుల నుంచి డబ్బు రాలేదు. అందాక ఇస్తామంటూ మధ్యాహ్నం వరకు గడిపేశారు. పింఛన్ సొమ్ముకు సరిపడా బ్యాంకుల నుంచి సొమ్ము కొన్ని సచివాలయాలకే చేరింది. ఇంకొన్ని వాటికి సాయంత్రం వరకు అందలేదు. ఇంతాచేస్తే పింఛన్ అందింది కొంతమందికే. నేడు, రేపు బ్యాంకుల నుంచి ఎంత డబ్బు అందుతుందో మరెంత మందికి ఇస్తారో చూడాల్సిందే.

ఉదయం నుంచి బారులు తీరిన పింఛన్‌దారులు

- సొమ్ములు రాక బ్యాంకుల వద్ద సచివాలయ సిబ్బంది పడిగాపులు
- జిల్లాకు అవసరం.. రూ.69 కోట్లు..
- ఇచ్చింది మాత్రం రూ.45.37 కోట్లు
- తొలిరోజు అందించింది రూ.23 కోట్లు
- టీడీపీపై నిందలు వేసేలా కృత్రిమ పాఠాలు

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పింఛన్ సొమ్ములు కోసం బీదా, బిక్కి జనం, వయో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇలా ఒకరేంటి అందరూ సచివాలయానికి చేరుకున్నారు. పింఛన్ కోసం పడిగాపులు పడ్డారు. మండుటెండలో ముప్పుతిప్పలకు గురయ్యారు. అధికారులు బుధవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పంపిణీ సాగుతుందన్నారు. జనం కాస్త ఉదయం ఎనిమిది గంటలకే ఆయా సచివాయాల ఎదుట వాలిపోయారు. తీరా చూస్తే సచివాలయాల తలుపులు చాలాచోట్ల తెరుచుకోలేదు. సిబ్బంది పది గంటల వరకు జాడ లేరు. మరికొన్నిచోట్ల పింఛన్‌దారులకు జవాబు చెప్పే నాథుడే కరువయ్యాడు. ఇంకొన్నిచోట్ల వేసవి తాపంతో వృద్ధులు విలవిల్లాడారు. చాలాచోట్ల సచివాలయాల ఎదుట టెంట్లు వేసి కుర్చీలు అందుబాటులోకి తెచ్చారు. ఇంకొన్నిచోట్ల మంచినీటి అవసరాన్ని మరిచారు. ఇలాంటి చోట్లే పింఛన్ తీసుకోవడానికి వచ్చిన వారంతా గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి వరకు పింఛన్ సొమ్ములను ఇళ్ళకు వచ్చి వలంటీర్లు అందిస్తూ వచ్చారు. కాని ఈ పరిస్థితి తలెత్తడంతో ముందు జాగ్రత్తలు చేయాల్సిన యంత్రాంగం చేయలేకపోయింది. ఓ వైపు ఎండలు హోరెత్తిస్తుండగా తొలిరోజు గంటల తరబడి సచివాలయం ఎదుటే జనం సాగిలపడ్డారు. బ్యాంకుల నుంచి డబ్బు తీసుకురావడానికి వెళ్ళిన సిబ్బంది చాలాచోట్ల మధ్యాహ్నం వరకు సచివాలయాలకు తిరిగి చేరుకోలేక పోయారు. అలాంటిచోట్ల పింఛన్‌దారులు పడినపాట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రత్యేకించి మంచంపట్టిన వ్యాధిగ్రస్థులకు, కదల్లేని వారికి ఇళ్ళ వద్దే పింఛన్ అందించాలని విపక్షాలు కోరినట్లు అధికార యంత్రాంగం అలాగే చేస్తామని బదులిచ్చింది. తొలి రోజు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. సచివాలయాలకు వచ్చిన వారికి మాత్రమే పింఛన్లు అందించారు. కొన్నిచోట్ల మధ్యాహ్నం 12 గంటలకు పింఛన్ పంపిణీ ప్రారంభమైంది. ఇంకొన్నిచోట్ల సాయంత్రం ఐదు దాటినా ఆరంభమే కాలేదు.



ప్రతిపక్షాలపై నిందలు

ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా పెన్షన్ లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతోంది. ప్రతిపక్షాలపై నిందలు మోపుతోంది. కావాలనే వలంటీర్లను అడ్డుకున్నారంటూ అధికార పార్టీ నేతలు కస్సుబుస్సులాడుతున్నారు. నగదు కోసం బుధవారం మధ్యాహ్నం వరకు సచివాలయ సిబ్బంది బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. ప్రభుత్వం మాత్రం దొంగ లెక్కలు చెబుతోంది. మొత్తం సొమ్మును జిల్లాలో సచివాలయ సిబ్బందికి అందజేసినట్టు బుధవారం సాయంత్రానికి లెక్కలు తేల్చింది. కానీ సిబ్బంది చేతికి సొమ్ములు రాలేదు. దీంతో కొన్ని సచివాలయాల్లోనే పెన్షన్‌ల పంపిణీ ప్రారంభించారు. ఇతర సచివాలయాల్లో గురువారం ఇస్తామంటూ పెన్షన్ లబ్ధిదారులకు తిప్పి పంపారు.

ఇంటికి ఇవ్వలేరా...

లబ్ధిదారుల ఇళ్లకే పెన్షన్ పంపిణీ చేసే అవకాశం ఉంది. జిల్లాలో 9,200 మంది వలంటీర్లు ఉన్నారు. వారు తమ పరిధిలో లబ్ధిదారులకు ఇంటికే వెళ్లి పెన్షన్ అందించేవారు. అదే సచివాలయ సిబ్బంది జిల్లావ్యాప్తంగా 4,200 మంది ఉన్నారు. దీనికితోడు మున్సిపల్, గ్రామ పంచాయతీ, వీఆర్వోలు తోడైతే ఇంటికి వెళ్లి ఇవ్వడం పెద్ద కష్టమేమీ కాదు. గతంలో నడవలేని వృద్ధులకు ఇళ్లకే వెళ్లి పెన్షన్‌లు ఇచ్చేవారు. మిగిలిన వారికి వార్డులో ఒక చోటకు రప్పించి పెన్షన్‌లు పంపిణీ చేసేవారు. ఇప్పుడు ఇంటికి వెళ్లి ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ సందర్భంగా ఎన్నికల సంఘం వలంటీర్లను పక్కన పెట్టాలని స్పష్టం చేసింది. అయితే ఉన్న సిబ్బందితో ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. సొమ్ములు కేటాయింపులో రెండు రోజులు జాప్యం చేసింది. ఇంతలోగా సచివాలయ సిబ్బంది అందరికీ అవగాహన కల్పించినా సరిపోయేది. అలా చేయలేదు. అటువంటి ప్రయత్నమూ చేయలేదు. పెన్షన్‌ల పంపిణీకి అడ్డు కట్టే వేసింది తెలుగుదేశం అంటే వైసీపీ నేతలు తిరిగి నిందలు మోపుతున్నారు. ఇంటికి వెళ్లి పెన్షన్ ఇవ్వాల్సిందేనంటూ తెలుగుదేశం నాయకులు డిమాండ్ చేశారు. అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఇవేమీ పట్టించుకోలేదు. అధికార పార్టీ నేతలు పెన్షన్ పంపిణీని తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంది.

ఇచ్చింది సగమే

జిల్లాలో 2,34,884 మంది పెన్షన్ లబ్ధిదారులు వున్నారు. వారికి ప్రతి నెలా దాదాపు రూ.68.91 కోట్లు పెన్షన్ రూపంలో పంపిణీ చేశారు. ఈసారి పూర్తిస్థాయిలో సొమ్ములు బ్యాంకులకు విడుదల చేసినట్టు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. రూ.45.37 కోట్లు మాత్రమే బ్యాంకుల్లో జమ అవడంతో ఈ మొత్తాన్ని విత్ డ్రా చేశారు. బుధవారం సాయంత్రం నుంచి పంపిణీ ప్రారంభించారు. మిగిలిన మొత్తం గురువారం అందుబాటులోకి రానుంది. సచివాలయాల వద్దకు వచ్చే సిబ్బంది ఇదే చెబుతున్నారు. దీంతో వృద్ధులు వెనుతిరుగుతున్నారు. దీనికి సమాధానం చెప్పలేకే వలంటీర్లను టీడీపీ అడ్డుకుంటోందని వైసీపీ ఎదురుదాడి చేస్తోంది.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

• ఇది జగన్.. రాజకీయ కుట్ర : నిమ్మల

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 3 : వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు పెన్షన్ సొమ్ము పంపిణీలో జగన్ రాజకీయ లబ్ధికి కుట్రకు పాల్పడుతున్నాడని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు. పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. పెన్షన్‌దారులు ఎంత మంది ఉన్నారు. ఎంత సొమ్ము వచ్చిందంటూ ఆయన సిబ్బందిని ఆరా తీశారు. పెన్షన్‌ల సొమ్ము పూర్తిగా రాకపోవడంతో అధికారులను నిలదీశారు. ఆయన విలేకర్లతో ప్రభుత్వం వద్ద పెన్షన్ సొమ్ము పంపిణీకి నిధులు లేనందువల్లే జాప్యం జరుగుతోందన్నారు. చేసిందంతా జగన్ చేసి ఈ నెపాన్ని చంద్రబాబుపైకి నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. 42 డిగ్రీల ఉష్ణోగ్రతలో సచివాలయాల వద్ద పంపిణీ చేస్తే వడదెబ్బ తగిలితే ప్రతిపక్షాలపై నెట్టాలనే దురుద్దేశమని ఆయన విమర్శించారు. రాబోయే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో జులై ఒకటో తేదీ నుంచి పెన్షన్‌లను ఇంటి వద్దే పంపిణీ చేసే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే రామానాయుడు స్పష్టం చేశారు.



చించినాడలో.. పెన్షన్ కోసం ఫొటో

అరకొరగా పెన్షన్లు

- పాలకొల్లు అర్బన్ : మండలంలో బ్యాంకుల నుంచి సొమ్ము రావడం ఆలస్యం కావడంతో బుధవారం సాయంత్రం నుంచి సచివాలయాల వద్ద వేచి ఉన్న వృద్ధులు, వితంతువులు కొందరికి మాత్రమే పెన్షన్ అందజేశారు. మిగిలిన వారికి గురు, శుక్ర, శని వారాల్లో ఇవ్వనున్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని 31 గ్రామాలకు గాను కుంచనపల్లి, రామన్నగూడెం పంచాయతీల్లో మాత్రమే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పది లక్షలు ఇవ్వాల్సిన చోట రూ.2 లక్షలే పంచాయతీ ఖాతాలకు జమ చేశారు.
- పెంటపాడు : మండలంలోని సచివాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. బ్యాంకుల నుంచి నగదు రాకపోవడంతో సాయంత్రం నాలుగున్నర వరకు పంపిణీ మొదలు కాలేదు. దీంతో లబ్ధిదారులు బారులు తీరారు.
- ఆచంట : బ్యాంకుల నుంచి డబ్బులు రాకపోవడంతో మేజర్ పంచాయతీల్లో పింఛన్‌దారులకు తొలిరోజు అందించలేదు. అధికారులు గురువారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామన్నారు.
- ఆకివీడు రూరల్ : పింఛన్ల కోసం వృద్ధులు ఉదయం నుంచి సచివాలయాల వద్ద బారులు తీరారు. నగదు కొన్ని పంచాయతీ ఖాతాలకు మాత్రమే జమ కావడంతో సాయంత్రం నుంచి కొందరికి ఇచ్చారు.
- యలమంచిలి : మండలంలోని 23 గ్రామలకు చించినాడ, మేడపాడు, కలగంపూడి పంచాయతీలకు మాత్రమే పింఛన్ సొమ్ములు పడడంతో అక్కడి వృద్ధులకు పంపిణీ చేశారు. మిగిలిన గ్రామాల్లో సాయంత్రం నాలుగు తర్వాత అరకొరగా ఇచ్చారు. వృద్ధులు మండుటెండలో అవస్థలు పడుతూ వెళ్లారు.



ఏలూరులో పింఛన్ల కోసం వేలిముద్రలు.. ఆకివీడు మండలం సిద్దాపురం సచివాలయం వద్ద పడిగాపులు, తాడేపల్లిగూడెం : కుంచనపల్లిలో వృద్ధుల ఎదురుచూపులు, ఏలూరులో ఎండలో వృద్ధుల పాట్లు



చించినాడలో పెన్షన్ కోసం మండుటెండలో..

టీవీల్లో రాజకీయ ప్రకటనలను పరిశీలిస్తున్నాం : కలెక్టర్

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 : వివిధ టీవీ ఛానల్స్‌లలో వచ్చే రాజకీయ పార్టీల ప్రకటనలు, సమావేశాలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు-2024 షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జిల్లాకు సంబంధించి వివిధ టీవీ చానల్స్‌లో ప్రసారమయ్యే ప్రకటనల నిమిత్తం ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఆమోదం పొందాలన్నారు. పెయిడ్ న్యూస్‌పై ఈ కమిటీ పరిశీలిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రచారాలు, ప్రకటనల వివరాలను కమిటీ నోడల్ అధికారికి అందజేయాలన్నారు. వీటిని పరిశీలించి అనుమతి ఇస్తామన్నారు. పెయిడ్ న్యూస్ ఖర్చును ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు సంబంధిత పార్టీల ఖాతాలకు, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అభ్యర్థుల ఖాతాలకు జమ చేస్తామని వివరించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పౌర సరఫరాలు, వ్యవసాయ, కోపరేటివ్, తూనికలు కొలతల శాఖ అధికారులపాటు జిల్లా రైస్ మిలర్స్ సంఘంతో కలిసి సంయుక్తంగా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్‌లో జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చెల్లించాలన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,183, గ్రేడ్-ఎ రకం క్వింటాకు రూ.2,203 అందించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా, ఆర్బీకేల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, అందుబాటులోకి తేవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సరిపడినన్ని గోనె సంచులను మిల్లర్ల నుంచి ముందుగానే తీసుకోవాలన్నారు. జిల్లాలోని రైసు మిల్లులకు కస్టోడీయన్ అధికారులను నియమించామని తెలిపారు. ధాన్యం తరలించడానికి రెండు వేల 600 వాహనాలను సిద్ధం చేశామన్నారు.

రాజకీయ రాజీనామాలు

- జిల్లా అధికారులకు అందిన వలంటీర్ల రాజీనామా పత్రాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం నుంచి ప్రజాధనాన్ని వేతనంగా అందుకున్న వలంటీర్ల రాజీనామాల్లో రాజకీయ డ్రామా నడుస్తోంది. టీడీపీ, జనసేన బలంగా వున్న గ్రామాల్లో అధికార పార్టీ నేతల ఒత్తిడితో వలంటీర్లు వరుస రాజీనామాలు చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో అత్యధికంగా వలంటీర్లు వైదొలుగుతున్నారు. ఆ తర్వాత స్థానంలో భీమవరం ఉంది. రాజీనామా చేసిన వలంటీర్లు టీడీపీ, జనసేన పార్టీలను విమర్శించడం రాజకీయాలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతలు వెనకుండి అంతా నడుతున్నారనడానికి ఇదే నిదర్శనం. ఇందుకు తగ్గట్టుగానే అధికార పార్టీ నేతలు వలంటీర్ల నుంచి రాజీనామా పత్రాలను తీసుకుంటున్నారు. వాటిని కార్యదర్శులకు, ఎంపీడీవోలకు పంపుతున్నారు. లేదంటే రాజీనామాలు చేయాలని ప్రోత్సహిస్తున్నారు. కొందరు వలంటీర్లు అధికార పార్టీ తరపున ప్రచారం చేస్తామంటూ బాహాటంగా చెబుతున్నారు. కేడర్‌ను కోల్పోయినచోట వైసీపీ నేతలు వలంటీర్లనే నమ్ముకుంటున్నారు. నెలసరి వేతనం ఇస్తామంటూ మభ్య పెడుతున్నారు. వాస్తవానికి వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మధ్య దూరం పెరిగింది. ఎమ్మెల్యేలంతా వలంటీర్లపైనే ఆధారపడుతూ వచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించినప్పుడు జనసమీకరణలోనూ వీరిదే కీలక భూమిక. గతంలో పార్టీ కేడర్ ఆ బాధ్యత వహించేది. గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలను కార్యకర్తలే దగ్గరుండి నిర్వహించేవారు. నియోజకవర్గ నేతలు హాజరయ్యేవారు. ఫలితంగా ఎమ్మెల్యేలకు, కేడర్‌కు రాజకీయ బంధం ఉండేది. ఇప్పుడంతా వలంటీరే చూసుకుంటున్నారు. ఇది కాస్త రాజకీయ నేతలకు, కేడర్‌కు మధ్య దూరం పెంచేసింది. ఎన్నికలకు వచ్చే సరికి కార్యకర్తలు కరువయ్యారు. అధికార పార్టీ నేతలు కుల సంఘాలనే నమ్ముకుంటున్నారు. వారితో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేతప్ప పార్టీ కార్యకర్తలతో ప్రచారాలు నిర్వహించడం, వారిని ముందుండి నడిపించడం వంటి కార్యకలాపాలు లేవు. దీంతో ఇప్పుడు వలంటీర్లనే నమ్ముకున్నట్టుంది. ఎన్నికల్లో పాల్గొనకూడదంటూ వలంటీర్లను ఎన్నికల సంఘం దూరం పెట్టడంతో వారంతా రాజీనామాలు చేయాలి.

మరికొందరి రాజీనామా

అత్తిలి/యలమంచిలి : అత్తిలి మండలానికి చెందిన 50 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల సంఘం ఎన్నికలు పూర్తయ్యే వరకు వలంటీర్లు పింఛన్లు, బియ్యం పంపిణీల్లో పాల్గొనరాదని ఉత్తర్వులు ఇవ్వడంతో తామంతా రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రాలను అత్తిలి ఎంపీడీవో పిహెచ్ శ్రీనివాస్‌బాబుకు అందజేశారు. యలమంచిలి మండలం కాజ పడమరలో 8 మంది వలంటీర్లు వారి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్‌కు అందజేశారు. 11 మంది వలంటీర్లకు 8 మంది రాజీనామా చేయడం గమనార్హం.

వీడియో గ్రాఫర్ తొలగింపు

పెదవేగి, ఏప్రిల్ 3 : దెందులూరు నియోజకవర్గం ఫ్లయింగ్ స్క్వాడ్‌లో వీడియో గ్రాఫర్ పామర్తి నాగరాజును విధుల నుంచి తొలగించామని ఆర్వో బి.లావణ్యవేణి తెలిపారు. నాగరాజు వైసీపీకి చెందిన వ్యక్తి అని టీడీపీ నాయకులు ఆధారాలు ఇవ్వడంతో విచారణ చేసి అతనిని తొలగించామని వివరించారు.

పోలవరాన్ని బొరగానికి కేటాయించాలి : నేతల డిమాండ్




భీమడోలు, ఏప్రిల్ 3 : పోలవరం స్థానాన్ని కూటమి అభ్యర్థిగా బొరగం శ్రీనివాస్‌కు కేటాయించాలని లేని పక్షంలో జనసేన అభ్యర్థిత్వం ఇచ్చి ఆ పార్టీ నుంచైనా ఆయనను బరిలోకి దింపాలని నియోజకవర్గ ముఖ్య నాయకులు తీర్మానించారు. భీమడోలులోని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో పోలవరం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వచ్చే ఎన్నికల్లో పోలవరం అభ్యర్థిగా బొరగాన్ని నిలబెట్టకపోతే గెలుపు సాధ్యం కాదని గన్ని దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌ను కలిసి దీనిపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గన్ని మాట్లాడుతూ నల్లజర్లలో ప్రజాగళం సభకు చంద్రబాబు రానున్న నేపథ్యంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని ఆయన మాటకు కట్టుబడి అందరూ పనిచేసి కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. పొత్తులో భాగంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో త్యాగం చేశారని ఆయనను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పోలవరం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు భారీ ఏర్పాట్లు

- టీడీపీలో ఎంపీ రఘురామ చేరికకు రంగం సిద్ధం

భీమవరం/నరసాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం నరసాపురంలో నిర్వహించే బహిరంగ సభకు కూటమి భారీ జన సమీకరణకు సన్నాహాలు చేస్తోంది. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో చంద్రబాబు హెలికాఫ్టర్‌లో దిగనున్నారు. అక్కడి నుంచి నరసాపురం వరకు రోడ్ షో నిర్వహించి, సభలో ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాలకు భారీగా జన సమీకరణ చేయాలని బుధవారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు నిర్ణయించారు. నరసాపురం, మొగల్తూరు మండలాలతోపాటు పట్టణం నుంచి 30 వేల మందిని సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వార్డులు, గ్రామాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని నిర్ణయించారు. గ్రామాల నుంచి వచ్చే వారికి ఆటోలు ఏర్పాటు చేయనున్నారు. హెలిప్యాడ్‌ను బుధవారం టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి పరిశీలించారు.

నేడు భీమవరం రాక



నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు టీడీపీలో చేరనున్నారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో ఆయన మంగళవారం ఆయన భేటీ అయ్యి ఈ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ నుంచి గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ర్యాలీగా తాడేపల్లిగూడెం - యండగండి - గొల్లలకోడేరు మీదుగా భీమవరం చేరుకుంటారు. తాడేపల్లిగూడెంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి నేతృత్వంలో రఘురామకు ఘన స్వాగతం పలకనున్నారు. భీమవరంలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటారు. నరసాపురం, పాలకొల్లుల్లో 5, 6 తేదీల్లో జరిగే ప్రజాగళం సభల్లో ఆయన పాల్గొంటారు. రానున్న ఎన్నికల్లో పోటీలో ఉంటారంటూ ఎంపీ అనుచర వర్గం ధీమాతో ఉంది. ఎక్కడ నుంచి ఏ స్థానానికి పోటీ చేస్తారనే విషయమై సస్పెన్స్ నెలకొంది.



భీమడోలు వద్ద తనిఖీల్లో సొమ్ము స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రూ.5,29,600 సీజ్

విస్తృతంగా తనిఖీలు

కామవరపుకోట/భీమడోలు/చింతలపూడి,/ఉంగుటూరు / జీలుగుమిల్లి, / ఏలూరు క్రైం ఏప్రిల్ 3. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తు న్నాయి. కొత్తూరు చెక్‌పోస్టు వద్ద బుధవారం ఉంగు టూరు మండలం నల్లమాడు గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి లక్షా ఆరు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. మంగళవారం రాత్రి తనిఖీల్లో రూ.76,600 నగదు స్వాధీనం చేసు కున్నామన్నారు. ఎన్నికల స్కాడ్ అధికారిణి సత్య వాణి ద్వారా ఏలూరు ఎన్నికల ట్రెజరీ అధికారికి పంపిం చామన్నారు. ఎన్నికల అధికారి ఎండీ మొహిద్దీన్, తడికల పూడి ఎస్ఐ జయబాబు, ఏఎస్ఐ వీరాస్వామి, వీఆర్‌వో బాబూరావు, కె.రామకృష్ణ, జి.సూర్యారావు, నాగార్జున, షేక్ నాగూర్ సాహెబ్, సౌజన్ సాయి తదితరులు ఉన్నారు.

- భీమడోలు మండలం గుండుగొలను హైవేపై ఫ్లైయింగ్ స్క్వాడ్ జరిపిన తనిఖీల్లో లక్ష రూపాయల నగదు గుర్తించి స్వాధీన పర్చుకున్నట్టు ఏలూరు ఆర్డీవో, ఆర్వో ఖాజావలీ తెలిపారు.
- చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్టు రూ.70 వేలు నగదుకు ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి జమ చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు.
- ఉంగుటూరు వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించగా కారులో రూ.77 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్వో ఖాజావలి తెలిపారు.
- తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అశ్వారావు పేట నుంచి మక్కినవారిగూడెం వెళుతున్న కారు తనిఖీ చేయగా రూ.లక్ష నగదు గుర్తించారు. నగదు ట్రెజరీకి అప్పగించనున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు.
- సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 28 వేల 130 రూపాయలు విలువైన 69.01 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నాలుగు లక్షల 67 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు అని తెలిపారు.

తాటియాకులగూడెం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న రూ.లక్ష నగదు చూపుతున్న అధికారులు





బెట్టింగ్ భూతం



జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు

- ఏలూరు చొదిమెళ్ళకు చెందిన భానుసుందర్ ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్ చదివాడు. ఫోన్‌లో క్రికెట్ బెట్టింగు యాప్‌లలో బెట్టింగ్‌లు ఆడి లక్షల్లో పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక అప్పులు ఇచ్చిన వారికి వైద్యం పేరుతో మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అనారోగ్యం పాలు చేయడం, హతమార్చడానికి కూడా వెనుకాడలేదు. రెండు రోజుల క్రితం ఏలూరు పోలీసులు ఆ డాక్టర్‌ను అరెస్టు చేశారు.
- గతంలో భీమవరం మండలానికి చెందిన ఒక యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లోవారు ఎంత చెప్పినా వినకుండా బెట్టింగ్‌లకు కాయడంతో అప్పుల పాలయ్యాడు. చివరకు ఉన్న ఆస్తిని అమ్మినా కూడా అప్పులు తీరలేదు. ఆ కుటుంబం రోడ్డున పడింది.
- భీమవరం శివారు ప్రాంతానికి చెందిన ఒక యువకుడు రొయ్యల చెరువులు చేస్తూ బాగా సంపాదించాడు. అయితే కొంతకాలానికి క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. చెరువుల్లో రొయ్యలు ఉన్నా సరే వాటిని పట్టించుకోకుండా రాత్రీ, పగలు బెట్టింగ్‌ల్లో మునిగి తేలాడు. చివరకు సంపాదించినదంతా అప్పులకు సరిపోలేదు. ఇలా బెట్టింగ్‌ల భూతానికి ఎంతోమంది బలవుతున్నారు.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, ఏప్రిల్ 3: క్రికెట్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ టీవీలో క్రికెట్ వస్తుంటే చూడకుండా ఉండలేరు. ఇష్టం ఉంటే ఫర్వాలేదు..కానీ అది బెట్టింగుల వైపు మళ్లిందంటే జీవితాలే సర్వనాశనం అయిపోతాయి. ఐపీఎల్ మ్యాచ్‌లు వచ్చాక చాలామంది బెట్టింగుల మాయలో మునిగిపోతున్నారు. ఎంతో మంది క్రికెట్ బెట్టింగుల వల్ల అప్పులు పాలవుతున్నారు. వాటిని తీర్చే మార్గం లేక, బుకీల వేధింపులు భరించలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.

బెట్టింగ్ రకరకాలు

ఐపీఎల్‌లో మొదటి ఆరు ఓవర్లకు ఎన్ని రన్స్ తీస్తారో దీనిని మొదటి ఫ్యాన్సీ అంటారు. దీనిపైన పందాలు కడతారు. ఇక రెండవ ఫ్యాన్సీ 7,8,9,10 ఓవర్లపై పందాలు నిర్వహిస్తారు. మూడో ఫ్యాన్సీగా 11వ ఓవర్ నుంచి 15 ఓవర్ వరకూ ఎన్ని రన్స్ తీస్తారు లేదా ఎన్ని వికెట్లు తీస్తారు అనే దానిపై మూడో ఫ్యాన్సీగా రెట్టింపు పందేలు కాస్తారు. నాల్గో ఫ్యాన్సీగా 16 నుంచి 20 ఓవర్ల మధ్యలో ఎన్ని వికెట్లు, ఎన్ని ఓవర్లు లేదా ఏ బ్యాట్స్‌మెన్ ఔట్ అయిపోతాడో రెట్టింపు పందాలు కాస్తారు. ఏ టీమ్ గెలుస్తుందో కూడా తాడోపేడో తేల్చేలా పందాలు కాస్తారు.

ఐపీఎల్ అంటే



ఇండియన్ ప్రిమియర్ లీగ్ 17 సంవత్సరాల క్రితం భారత దేశంలో ప్రారంభించారు. అప్పటి వరకూ ఉన్న క్రికెట్ విధానం వేరు. ఐపీఎల్ ఆట విధానం వేరు. భారత దేశంలో 12 టీమ్‌లు, 20 ఓవర్స్ చొప్పున ఆటను ఆడతాయి. దీనినే 20-20 అని అంటారు. 17వ సారి భారత దేశంలో ప్రస్తుతం 12 టీమ్‌లతో 74 మ్యాచ్‌లు జరుగుతున్నాయి. శనివారం, ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7.30కి మరో మ్యాచ్ జరుగుతాయి. మిగిలిన రోజుల్లో రోజుకు ఒక మ్యాచ్ చొప్పున క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయి.

అప్పుల్లో కూరుకుపోతున్న కుటుంబాలు
తీర్చలేక ఆత్మహత్యలు
నాడు బుకీలు.. నేడు ఆన్‌లైన్ యాప్‌లు

యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు

గతంలో క్రికెట్ బుకీలు పందాలు కాస్తూ ఉండేవారు. వారు ఒక హోటల్‌లోనో, లాడ్జీ రూమ్‌ల్లోనూ, ఒక ఇంట్లోనో టీవీ పెట్టుకుని, మొబైల్స్ పెట్టుకుని పందాలు నిర్వహించేవారు. నేడు ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌లు రావడంతో వంద రూపాయల నుంచి కోట్లాది రూపాయల వరకూ యాప్‌ల్లో జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో వేలు, లక్షల రూపాయల్లో మాత్రమే పందాలు సాగుతున్నాయి. కొన్ని యాప్‌లలో మినిమం వంద రూపాయల నుంచి ప్రారంభం కాగా, కొన్ని యాప్‌లలో వెయ్యి రూపాయల నుంచి ప్రారంభం అవుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా బాక్స్ బెట్టింగులు ఎక్కువగా జరుగుతున్నాయి. క్రికెట్ బుక్కీల పరిభాషలో బాక్స్ అంటే లక్ష రూపాయలు పందెం అని అర్థం. ఇక ఎన్ని బాక్స్‌లు అంటే అన్ని లక్షలు పందెంలో పెడుతున్నట్టు. బుకీలు 20 శాతం సొమ్ములను తీసుకుని మిగిలిన సొమ్ము ఇస్తారు. పందాలు కాసేవారు పాత వారు అయితే అప్పుల్లో కూడా పందాలు కడుతూనే ఉంటారు. అప్పులు తీర్చకపోతే నేరుగా రికవరీ బృందం దిగిపోతుంది. ఇళ్ళకు బంధువులు, స్నేహితుల రూపంలో వచ్చి ఇంట్లో తలుపులు వేసి పంచాయతీ పెడతారు. క్షణాల్లో వారి నుంచి చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఆస్తులకు సంబంధించిన డాక్యు మెంట్లను స్వాధీనం చేసుకుని వెళ్ళిపోతారు. లేదా ప్రాణాలు తీస్తామంటూ బెదిరిస్తారు.బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు.

తల్లిదండ్రులే దృష్టి పెట్టాలి

జిల్లాలో పేద వాడి నుంచి ధనికుడి వరకూ చిన్న ఉద్యోగుల నుంచి కొంత మంది పెద్ద ఉద్యోగులు కూడా ఈ బెట్టింగ్‌ల బారినపడ్డట్లుగా తెలుస్తోంది. నేరుగా వారి మొబైల్స్‌లోని ఆండ్రాయిడ్ ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగు యాప్‌లను డౌన్‌లోడు చేసుకుని బెట్టింగుల్లో కూరుకు పోతున్నారు.తల్లి దండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఎక్కువ శాతం మంది యువతే ఈ బెట్టింగులకు పాల్పడు తున్నట్లు తెలుస్తున్నది. తెలిసీ తెలియని వయస్సుల్లో క్రికెట్ పట్ల ఆకర్షణకు గురై ఆపై క్రీడాకారులపై అభిమానాన్ని పెంచుకుని బెట్టింగులకు పాల్పడు తున్నారు. ఇలాంటి వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తల్లిదండ్రులే కౌన్సెలింగ్ ఇవ్వాలి.

క్రికెట్ బెట్టింగ్‌లు, జూదాలు వల్ల కుటుంబాలు రోడ్డున పడు తున్నాయి. వాటి జోలికి ఎవరూ వెళ్ల వద్దు. చాలామంది గతంలో క్రికెట్, జూదాలు వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. విద్యార్థులు, యువత కూడా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై దృష్టి పెట్టాలి.



చిన్నారులతో ఆటలా..

ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేట్ విద్య
విద్యాహక్కు చట్టం అమల్లో తికమక
1,162 విద్యార్థులకు ఫీజు భారం
స్కూళ్లకు చెల్లించిన ప్రభుత్వం

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేలా గత టీడీపీ ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ ప్రవేశపెట్టింది. 1 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులు తాము ఎంచుకున్న స్కూళ్లలో చదువుకునేందుకు అవకాశం ఇచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు సొమ్ములు జమ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ స్కీమ్‌ను పక్కన పెట్టి విద్యా హక్కు చట్టం అని కొత్త పథకం తీసుకు వచ్చింది. ఈ పథకం సక్రమంగా అమలు చేయకుండా చిన్నారులతో ఆటలాడుతోంది. ప్రభుత్వం ఫీజుల చెల్లింపుల్లో గందరగోళం కాస్తా విద్యార్థుల తల్లితండ్రులకు భారంగా మారింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,162 మంది విద్యార్థులు విద్యాహక్కు చట్టం కింద 139 ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతిలో చేరారు. విద్యా సంవత్సరం పూర్తయింది. ప్రభుత్వం పాఠశాలలకు సొమ్ములు చెల్లించకపోవడంతో ఫీజులు కట్టాల్సిందేనని స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థుల తల్లితండ్రులు విద్యా శాఖల చుట్టూ తిరిగినా సమాధానం మాత్రం దొరకడం లేదు. గతేడాది జూన్‌లో వీరికి అడ్మిషన్లు తీసుకోవడంతో అమ్మఒడికి వీరు నమోదు కాలేదు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం జూన్ నెలలో అమ్మఒడి పడుతుందని ఆ సొమ్ములు జమ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతుండడంతో స్కూళ్ల యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. ప్రభుత్వ విధానాలతో ఇటు తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యాజమన్యాలకు దిక్కుతోచడం లేదు. అమ్మఒడితో సంబంధం లేకుండా ఫీజు చెల్లించాల్సిన వైసీపీ ప్రభుత్వం ఇలా కొర్రీ పెట్టడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 3 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో వీరి పరిస్థితి ఎలా ఉంటుందో మరి..



బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ పక్కన పెట్టి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్‌లో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. దీంతో ఆ పథకంలో లబ్ధి పొందే వందల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వారి దగ్గరలో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే అవకాశం కోల్పోయారు. ఉన్న విద్యా సౌకర్యాలను తీసేసి విద్యార్థులను ఇబ్బందుల పాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

కూలీ సొమ్ములు నొక్కేసిన వలంటీర్

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలు

ఆకివీడురూరల్ ఏప్రిల్ 3 : ఆకివీడు మండలం కుప్పనపూడి సచివాలయంలో వలంటీర్ తమ ఉపాధిహామీ కూలీ సొమ్ము దోచేసిందని గ్రూపు సభ్యులు ఆరోపించారు. కుప్పనపూడి గ్రామంలో ఉపాధిహామీ పనులు బాధ్యత తీసుకున్న వలంటీర్ వీరమల్లు వెంకటేశ్వరమ్మ సుమారు రూ.4 లక్షలు వరకు నగదు స్వాహా చేసిందని చెబుతున్నారు. గ్రామంలో సుమారు 100 మంది వరకు ఉపాధి కూలీలుగా పనిచేస్తున్నామని తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి జూలై వరకు తమచే 40, 50, 60 పనిదినాలు చేయించి మస్తర్‌లో 100 పనిదినాలుగా చూపించిందని తెలిపారు. చేసిన పనిదినాలకు నగదు పోస్టాఫీసు ఖాతాలో జమకావాల్సి ఉండగా, ఫినో ఎకౌంటు ద్వారా వేలి ముద్రలు తీసుకుని నగదు అందజేస్తున్నదని ఆరోపించారు. ఎవరైనా అడిగితే తమకు పని కల్పించకుండా కొత్తవారికి పని చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డు, కొత్త పుస్తకాలు ఇప్పిస్తానని రూ. 20 వసూలు చేసి, ఇప్పటి వరకు అందజేయలేదని తెలిపారు. దీనిపై మార్చి 28వ తేదీన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపు రాష్ట్ర స్థాయి అండర్-17 చదరంగం పోటీల క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఏప్రిల్ 3: పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఈ నెల 5న భీమవరం అనసూయ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి అండర్ 17 బాయ్స్, గరల్స్ చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు 1-1-2007వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 20, 21 తేదీల్లో గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.వివరాలకు 90632 24466 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



ఐలు శిక్షణా తరగతుల కరపత్రం విడుదల చేస్తున్న యూనియన్ సభ్యులు

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఆల్ ఇండియా లాయర్ యూనియన్ (ఎఐ ఎల్‌యు) ఈనెల 6న ఏలూరులో నిర్వహించనున్న తరగతులకు జూనియర్ న్యాయవాదులు హాజరై వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో యూనియన్ సభ్యులు శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఐలు జిల్లా కమిటీ కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ తరగతులకు 1వ అదనపు సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్, ఐలు రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు రాజగోపాల్, నర్రా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు రోనాల్డ్‌రాజు, బీవీ కృష్ణారెడ్డి, నాగరాజు, విజయభాస్కర్, ఐలు జిల్లా అధ్యక్షురాలు శైలజ పాల్గొంటారని తెలిపారు.

కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు బీసీలతో సమానంగా సౌకర్యాలు కల్పించాలి : జోగయ్య

పాలకొల్లు, ఏప్రిల్ 3: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అధినాయకులకు కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య బుధవారం ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్తులు బ్రిటీష్ కాలంలోనే బీసీలుగా పరిగణించబడి ఉన్నారని, వివిధ కారణాల రీత్యా వారిని ఓసీలుగా మార్పు చేశారన్నారు. సమాజంలో 25 శాతం జనాభా కలిగిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు బీసీలతో సమానంగా సంక్షేమ సౌకర్యాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.



3-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	241	236	239.73
	జంగారెడ్డిగూడెం-1	242	235	239.97
	జంగారెడ్డిగూడెం-2	241	235	239.84
	కొయ్యలగూడెం	240	237	239.99
	గోపాలపురం	240	235	238.59

అలంపురం పంచాయతీకి పవర్ కట్ !

బిల్లులు చెల్లించలేదని సరఫరా నిలిపివేసిన అధికారులు
10.27 లక్షలు చెల్లించాలంటూ నోటీసులు
చెల్లించాల్సింది 3.55 లక్షలే : సర్పంచ్





విలేకర్ల తో మాట్లాడుతున్న సర్పంచ్ తాతపూడి ప్రగతి

పెంటపాడు, ఏప్రిల్ 3 :పెంటపాడు మండలం అలంపురం పంచాయతీలో చీకట్లు అలుముకున్నాయి. బిల్లులు చెల్లించలేదని అధికారులు కార్యాలయానికి విద్యుత్ నిలిపివేశారు. తాము చెప్పేది వినకుండా విద్యుత్ శాఖ అధికారులు పవర్ కట్ట చేశారని సర్పంచ్ తాతపూడి ప్రగతి ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రూ.10,27,707 విద్యుత్ బకాయి చెల్లించాల్సిందిగా పంచాయతీ కార్యాలయానికి అధికారులు డిమాండ్ నోటీస్ పంపించారన్నారు. 2021 మార్చిలో 14వ ఆర్థిక సంఘం నిధులతో రూ 37,99,122 విద్యుత్ బకాయిల కోసం చెల్లించామన్నారు. వాస్తవానికి తాము అప్పుడు రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. అయితే నిధులు వెనక్కి మళ్లిపోతాయన్న ఉద్దేశంతో అదనంగా చెల్లించామన్నారు. రూ.6 లక్షలు జమ కాగా ఇంకా తమ పంచాయతీ నిధులు సుమారు రూ.32 లక్షలు విద్యుత్ శాఖ వద్దే ఉన్నాయన్నారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లులు పోను పంచాయితీకి సుమారు రూ.6,72,137 విద్యుత్ శాఖ నుంచి రావల్సి ఉందన్నారు. ఇప్పుడు రూ.10,27,707 లక్షలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీస్ వచ్చిందని తమకు రావాల్సిన బకాయి పోగా ఇంకా తాము సుమారు రూ.3.55 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ మొత్తాన్ని కూడా చెల్లించేందుకు ప్రయత్నించామని మార్చినెలలో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన సీఎఫ్ఎంఎస్ నుంచి చెల్లింపులు ముందుకు సాగని కారణంగా ఏప్రిల్‌లో అవుతుందని అధికారులు చెప్పారని అందుకే జాప్యం జరిగిందన్నారు. ఇదేమీ వినకుండా విద్యుత్ అధికారులు విద్యుత్ నిలిపివేయడం ఎంతవరకూ సమజం అంటూ ప్రశ్నించారు.దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి ఇలియాస్ బేగ్ మాట్లాడుతూ సొమ్ములు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని చెప్పినా వినకుండా అధికారులు విద్యుత్ నిలిపివేశారన్నారు. దీనివల్ల కార్యాలయంలో పనులు ఏమీ జరగక చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. పింఛన్ అందించే సమ యంలో విద్యుత్ లేకపోవడం వల్ల లబ్దిదారులు కూడా ఇబ్బంది పడతారన్నారు.

విద్యుత్ చౌర్యం కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఒక వడ్రంగి మేస్త్రీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నాడని సమాచారం అందుకున్న జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అతనిపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడులో ఉప్పటి సోమరాజు కార్పెంటరీ షాపు నిర్వహిస్తున్నారు.అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వారి సిబ్బందితో దాడి నిర్వహించారు. అతనిపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి 68,155 రూపాయలు అపరాధ రుసుం, ఏడు వేల రూపా యల జరిమానా విధించారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఒకరి మృతి

భీమడోలు, ఏప్రిల్ 3 : భీమడోలు సమీపంలో ఏలూరు కాలువలో వ్యక్తి మృత దేహాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించారు. భీమడోలు జంక్షన్‌లో గ్యాస్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న దౌరి శ్రీను (50) అనే వ్యక్తి మంగళవారం భీమడోలు కనకదుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న కాలువ రేవులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడ్డాడు. ఈ ప్రమాదంలో శ్రీను నీట మునిగి మృతి చెందాడు. బుధవారం మృతదేహం కాలువలో తేలుతుండగా స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

భీమవరం క్రైం, ఏప్రిల్ 3 : భీమవరం రెండో పట్టణానికి చెందిన పూర్ణిమ, ఆమె కుమారుడు సత్యకార్తిక్ ఆచూకీ ఈనెల 2 నుంచి లేదని పూర్ణిమ తండ్రి రాధాకృష్ణ ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు.భార్యా, భర్తల మధ్య మనస్పర్థలు కారణమని ఫిర్యాదులో పేర్కొనగా ఏఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మంచినీరు అనుకుని యాసిడ్ తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : మంచినీరు అనుకుని యాసిడ్ తాగిన ఒక వృద్ధుడు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొత్తూరు వంతెన పక్కన ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్న కండిబోయిన పెద్దిరాజు (62) ఈనెల 1వ తేదీన ప్రమాదవశాత్తు మంచినీళ్లు అనుకుని యాసిడ్ తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి విజయవాడలో పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

పెనుగొండ, ఏప్రిల్ 3: అప్పులు చేసి అవి తీర్చలేక ఆర్థిక సమస్యలతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో చోటు చేసుకుంది. పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొంగరావిపాలేనికి చెందిన కోన నరసింహమూర్తి (45) అప్పులు చేశాడు. అప్పులు తీర్చే దారిలేక, సమస్యలు ఎక్కువ అవడంతో గతనెల 29న పంట పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. భార్య కోన లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెనుగొండ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రామారెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి దొంగలు అందులోని కాపర్‌వైరును దొంగిలించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం వట్లూరు శివారులోని రైతు మురళీకృష్ణ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలకొట్టి దొంగలు అందులోని కాపర్‌వైరు దొంగిలించారు. దీంతో పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఓ ప్రయాణికురాలి వద్ద బంగారు గొలుసు మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ వాణీ నగర్‌కు చెందిన పులి శ్రీలక్ష్మి ఏలూరు సత్రంపాడులో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చేందుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడ వరకూ వచ్చింది. గత నెల 2వ తేదీన విజయవాడ నుంచి ఏలూరు వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఎక్కి సత్రంపాడులో దిగింది. బ్యాగులో ఉన్న పర్సు కనిపించలేదు. అందులో ఉన్న బంగారు గొలుసు పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పోడూరు మండలం జగన్నాథపురంలో రోడ్డు ప్రమాద దృశ్యం

లారీ ఢీకొని భార్య, భర్తలు మృతి

పోడూరు, ఏప్రిల్, 3 : లారీ ఢీకొట్టిన ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరూ మృతిచెందిన ఘటన బుదవారం పోడూరు మండలం జగన్నాథపురంలో జరిగింది. పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండ మండలం కొఠాలపర్రు గ్రామానికి చెందిన ఇసురు మాదయ్య రెడ్డి (50), భార్య కృష్ణవేణి దంపతులు పాలకొల్లులోని ఒక వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జగన్నాధపురం రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణికి తలకు, శరీరానికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మాదయ్య రెడ్డిని 104 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందారు. మృతుడు పైపుల వ్యాపారం చేస్తుంటాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్డీవో



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3: కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య హెచ్చరించారు. తాడేప ల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రలోభాలు కల్పించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పట్టణ, రూరల్ సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే భవిత : మార్నీడి బాబ్జి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఏ పార్టీలు మాట్లాడటం లేదని, కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని తాడేపల్లిగూడెం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్నీడి బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరుసగా రెండోసారి తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు బాలబొమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.8,333 పింఛన్ అందిస్తాం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 3 : కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు రూ.8333 పింఛన్ అందిస్తామని పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం గాంధీ భవనంలో బుధవారం ఆయనను పార్టీ నాయకులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. బోణం వెంకట్రావు, మదీనా బాషా, వర్ధనపు కాసు, గంటా నరసింహమూర్తి, ఆర్.బెన్నీపాల్, గేడి నాగమోహనరావు, బొలిశెట్టి భానుప్రసాద్, ముడకల గోపాలరావు, యలమర్తి మోహనరావు, కె.భాస్కరావు తదితరులు ఉన్నారు.

'పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టొద్దు'

భీమవరం అర్బన్, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఇళ్లకే వెళ్లి నగదు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్ల బోయిన రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పింఛన్లు తీసుకోవాడానికి సచివాలయాలకు రమ్మని అధికారులు చెప్పడం సరికాదన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులకు ఇంటికి వచ్చి ఇస్తామని సిబ్బంది సమాచారం అందించాలని కోరారు.

సైనిక శిక్షణతో అన్ని రంగాల్లోనూ రాణింపు



విద్యార్థులతో చైర్మన్ భోగేశ్వరరావు, విశ్రాంత అధికారి అస్కార్‌దాస్

పెంటపాడు, ఏప్రిల్ 3: సైనిక శిక్షణ తీసుకున్న విద్యార్థులు అన్ని రంగాలలోనూ రాణించవచ్చునని ఎయిర్ ఫోర్స్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ ఆస్కార్ దాస్ అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ డిఫెన్స్ అకాడమీని బుధవారం ఆయన సందర్శించారు. టీబీఆర్ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించేందుకు సెలక్షన్ సర్వీసెస్ బోర్డులో సేవలందించిన ఆస్కార్ దాస్ ఈ సైనిక శిక్షణా కేంద్రంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు విచ్చేశారన్నారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ బాలమురళి, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమన్వయంతో పనిచేయాలి

పెనుగొండ, ఏప్రిల్ 3 : దేశంలో మరోసారి మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకురావడానికి మూడు పార్టీల కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ అన్నారు. సిద్ధాంతం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన నాయకుల సమక్షంలో మండలస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి శివయ్య మాట్లాడుతూ పార్టీలు వేరైనా మన లక్ష్యం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు కొండవీటి శ్రీను, బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన వైసీపీ

ఇరగవరం, ఏప్రిల్ 3 : వైసీపీ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చేసిందని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా సాయిబాబు ఆరోపించారు. తణుకు కూటమి అభ్యర్థి రాధాకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని రేలంగి దళితవాడలో బుధవారం ప్రచారం చేపట్టారు. వైసీపీ దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిందని, సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. కూటమి గెలుపొందిన తరువాత ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కారం బాబూరావు, అధికార ప్రతినిధి కొల్లి అప్పారావు, ముప్పిడి నరసింహమూర్తి, కాసగాని రామకృష్ణ, బొంతు చిట్టిబాబు, చెట్టే శ్యామ్, మల్లిపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలు కీలకం

ఇరగవరం, ఏప్రిల్ 3 :కూటమి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి అయినం బలరామకృష్ణ తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు బుధవారం ఇరగవరంలో బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఎన్నికల్లో బూత్ కమిటీలు ముఖ్య పాత్రపోషించాలని సూచించారు. ఇరగవరం మండల బీజేపీ అధ్యక్షుడు కాట్నం పరిపూర్ణం, కడలి విజయబాబు, కోచే భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.లక్ష వితరణ




పాఠశాలకు చెక్కు అందిస్తున్న వెంకట సత్యనారాయణరాజు

పెనుమంట్ర, ఏప్రిల్ 3 : పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కలిదిండి వెంకట సత్యనారాయణరాజు పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. లక్ష వితరణ చెక్కును హెచ్ఎం బీడీ సరస్వతికి బుధవారం అందజేశారు. పాఠశాలలో చదువుకుని ఓఎన్‌జీసీలో ఉద్యోగిగా పదవీ విరమణ చేసిన అనంతరం చదువుకున్న పాఠశాలకు తన వంతుగా సాయం అందించానన్నారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఆధ్యాత్మికం

వేడుకగా విగ్రహాల ప్రతిష్ఠ పూజలు



కరుగోరుమిల్లిలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఆచంట, ఏప్రిల్ 3: కరుగోరుమిల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీగణపతి, అభయ ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవ కార్యక్రమాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు వేడుకగా నిర్వహించారు.

అర్ధవరంలో అమ్మవార్ల జాతర ప్రారంభం

గణపవరం, ఏప్రిల్ 3: అర్ధవరం గ్రామ ఇలవెల్పు కట్లమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల జాతర బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవార్ల గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గరగనృత్యాలు, శక్తివేషాలు, తీన్‌మార్‌డప్పులు, బ్యాండ్ మేళాలతో గ్రామమంతా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురు, శుక్రవారాలు అమ్మవార్లకు నైవేద్యాలు, మొక్కుబడులు తీర్చుకుంటారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

గణపవరం, ఏప్రిల్ 3 : కొత్తపల్లి గ్రామంలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 4వ తేదీ వరకు జరిగే మహోత్సవాలకు వేదపండితులు వేదల సుబ్రహ్మణ్య శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కైతేపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు జరుగుతున్నాయి. బుధవారం భీమనాడి నాగశివ శ్రీదేవి దంపతులచే స్వామివారి కల్యాణం నిర్వహించారు.



తణుకులో కూటమి నాయకుల సంఘీభావం, ఆకివీడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు సతీమణి సుష్మ, గొల్లవానితిప్ప ఆత్మీయ సమావేశంలో నాయకులు

కూటమి పొత్తుతో.. అభివృద్ధికి కృషి

» తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 3: కూటమి పొత్తు.. ఎన్నికల వరకే కాదని నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో పొత్తు తర్వాత మొదటిసారిగా మూడు పార్టీలు కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులను సమన్వయం చేసుకుని ప్రచారం చేయడంతో పాటు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. తర్వాత నామినేటెడ్ పదవుల్లో జనసేన, బీజేపీ నాయకులకు తగిన ప్రాధాన్యమిస్తామన్నారు. త్వరలోనే ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తామని, తణుకు గడ్డపై కూటమి జెండా ఎగరేస్తామని వివరించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ జనసేన, టీడీపీ రెండు పార్టీలు టికెట్లు ఆశించాయని, పొత్తులో టీడీపీకి పెద్దలు సీటు కేటాయించారని, దానిని అంతా గౌరవించాలన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఐతంపూడి శ్రీదేవి, టీడీపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, బసవ రామకృష్ణ, పితాని మోహన్, ఆనాల ఆదినారాయణ, గోపిశెట్టి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు ఆకేటి కాశీ, దాసం బాబ్జి, చిక్కాల వేణు, కొమ్మిరెడ్డి శ్రీనివాసుతోపాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. బుధవారం పట్టణంలో పలు వార్డుల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో కేవలం ఒక్కరోజులోనే ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా అలా చేయకుండా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. పరిమి వెంకన్నబాబు, తోట సూర్యనా రాయణ, తిరుమల సుబ్బారావు, ఊట రామకృష్ణ, ఒమ్మి రాంబాబు, కడియా ల సూర్యనారాయణ, చిక్కాల వేణు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరిమిల్లి సతీమణి ప్రచారం

ఆరిమిల్లి రాధాకృష్ణకు మద్దతుగా ఆయన సతీమణి కృష్ణతులసి సజ్జాపురంలోని 28, 29 వార్డుల్లో బుధవారం ప్రతి ఇంటికి వెళ్ళి ఇంటి పెద్దల్ని, మహిళలను కలసి పథకాలపై వివరిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణను, ఎంపీగా వర్మను గెలిపించాలని కోరారు.

- ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ శ్రీ గణేష్ హోల్‌సేల్ పండ్ల వర్తక సంఘం, శ్రీశ్రీనివాసా రిటైల్ పండ్ల వర్తక సంఘం సభ్యులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి : అంజిబాబు

భీమవరం రూరల్, ఏప్రిల్ 3 :వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని భీమవరం జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. గొల్లవానితిప్ప గ్రామంలో నిర్వహించిన జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి వద్దనే సకాలంలో పింఛన్ సొమ్మును పంపిణీ చేయవచ్చని, అందుకు భిన్నంగా జగన్ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దిగజారుడు రాజకీయాలకు తెరలేపాడని విమర్శించారు. బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ కేంద్ర పథకాలను వైసీపీ సొంత పథకాలుగా ప్రచారం చేసుకొని రాష్ట్ర ప్రజలను సీఎం జగన్ మోసం చేస్తున్నారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ కూటమి విజయం తథ్యమన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు వేగేశ్న కనకరాజుసూరి, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పులపర్తి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతం చేయాలి

పెంటపాడు, మార్చి 3: వైసీపీ అవినీతి పాలనను అంతమొందించాలని తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పెంటపాడులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలసి ఎన్నికల శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని, తాగునీరు సరిగా రాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలవల బాబ్జి మాట్లాడుతూ పింఛన్ల కు సొమ్ములు లేక ఆలస్యం చేసి ఆ తప్పును ప్రతిపక్షాలపై నెట్టేందుకు వైసీపీ నీచ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీలు దారుణంగా మోసపోయారని వారికి రావల్సిన పథకాలన్నీ వైసీపీ రద్దు చేసిందన్నారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, బండి పెద్దిరాజు, కసిరెడ్డి మధులత పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని గెలిపించుకోవాలి : మంతెన సుష్మ

ఆకివీడు, ఏప్రిల్ 3: వైసీపీ పాలనలో పదేళ్ళు వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీ కూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మ అన్నారు. ఇంటింటికి రాంబాబు, టీడీపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పదో వార్డులో ఆమె ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, చేబ్రోలు పెద్దిరాజు, శ్రీను, బచ్చు సరళాకుమారి, అజ్మల్, బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, నేరెళ్ల ప్రసన్న, బత్తుల శ్యామల, ఎం.సత్యవతి, బొర్రా సుజాత, గవర లక్ష్మి, గుర్రాని నాగలక్ష్మి, గొడవర్తి మణికంఠ, ఇల్లాపు కృష్ణవేణి, వేగేశ్న రామరాజు తదితరులు ఉన్నారు.

కావాలనే పింఛన్ల ఆలస్యం

రానున్న ఎన్నికల్లో మరలా అధికారం చేపట్టేందుకే ఈ నెల పి ంఛన్లు సమయానికి అందచేయకుండా ఈ ప్రభుత్వం ఆలస్యం చేస్తుందని ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మ అన్నారు. బుధవారం ప్రచారంలో భాగంగా అవ్వలకు పింఛన్లపై వివరించారు. ఖజానాలో డబ్బులు లేనందున దానిని ప్రతిపక్షాలపై సీఎం జగన్ రుద్దుతున్నారని విమర్శించారు.

బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి తిరగాలి

ఆచంట, ఏప్రిల్ 3 : వచ్చే ఎన్నికల్లో కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పితాని సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాసవర్మను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పెద మల్లంలో మండల అధ్యక్షుడు ముచ్చర్ల నాగ సుబ్బారావు అధ్యక్షతన బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేనతో సమన్వయం చేసుకుని ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. కొత్త భాస్కర నాగభూ షణం, హరిశివరామకృష్ణ, రామిశెట్టి రామచంద్రరావు, దమ్మా రాంబాబు, బోడపాటి నాగమసేన్ రావు, వేండ్ర సిద్ధయ్య, కాసుల సాయి, అందే బసవగణపతి, కోమటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జిని కలిసిన ఎంపీ అభ్యర్థి వర్మ

కలసి పనిచేద్దాం : భూపతిరాజు శ్రీనివాస వర్మ

తాడేపల్లిగూడెం రూరల్/అర్బన్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో టీడీపీ, జనసేనతో బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేసి కూటమిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ సూచించారు. తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ నివాసం వద్ద బుధవారం బీజేపీ నాయకులతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగన్ మోసాలు, అబద్ధాలకు అంతులేదని, వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి నివాసాలకు ఆయన వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్మను బాబ్జి సత్కరించారు. ఉమ్మడి కార్యాచరణపై సమీక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పోతుల అన్నవరం, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, గంధం సతీష్, రామ్‌లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

జనసేనకు మద్దతు ఇవ్వాలి : పొత్తూరి రామరాజు



పాతపాడులో జనసేన అభ్యర్థి నాయకర్, రామరాజు తదితరులు

మొగల్తూరు, ఏప్రిల్ 3 : కూటమిలో భాగంగా జనసేన పార్టీ నుంచి నరసాపురం అసెంబ్లీకి పోటీ చేస్తున్న బొమ్మిడి నాయకర్‌కు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు కోరారు. బుధవారం పాతపాడులో 'మనకోసం మన నాయకర్' కార్యక్రమంలో భాగంగా నాయకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రి జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ జనసేన అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కొల్లాటి గోపి, వలవల నాని, బందెల రవీంద్ర, వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, అందే దొరబాబు, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, పోలిశెట్టి నళిని, అందే రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి 50 మంది కేపీపాలెం గ్రామస్థులు

కేపీపాలెం సౌత్ గ్రామానికి చెందిన దొంగ పుల్లారావు, బొక్కా రామాంజనేయులు, బళ్ల స్వామి, యాండ్ర దుర్గారావు, కఠారి దాసు, నేతల జలదుర్గారావు, అందే శ్రీను, బత్తుల ఏసు, ఉల్లంపర్తి సురేష్, అందే లాజర్, ఒడుగు ధర్మయ్య ఇతర పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బొమ్మిడి నాయకర్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఎంపీటీసీ అందే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల గెలుపు ఖాయం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 3 : ప్రజల కష్టసమయాల్లో ఆదుకునే నాయకుడైన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గెలుపు ఖాయమని టీడీపీ మండల నాయకులు అన్నారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు కోడి విజయ భాస్కర్‌తో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సేవా భావంతోనే తప్ప, డబ్బు, కులంతో ఎమ్మెల్యే కాలేరన్నారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా సేవలందించిన నిమ్మల రామానాయుడుపై వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ నియోజకవర్గానికి సంబంధం లేని గోపి డబ్బుతోనూ, ఒక సామాజిక వర్గం ఓట్లతోనూ ఎమ్మెల్యే కావాలను కోవడం అవివేకం అన్నారు. సీహెచ్ సహదేవుడు, మామిడిశెట్టి లలిత కుమారి, మల్లుల రవీంద్ర కుమార్, కట్టా రాజ్‌కుమార్, శీలం అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

వృద్ధులను ఇబ్బంది పెడతావా ?

సీఎం జగన్‌పై అంగర రామ్మోహన్ ధ్వజం



పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 3:పింఛన్ల పంపిణీలో అవ్వాతాలు, దివ్యాంగులు, వితంతు మహిళలను సచివాలయాలకు పిలిచి ఎండలో ఇబ్బంది పెడుతున్నది సీఎం జగన్మోహన్‌రెడ్డేనని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒకటో తేదీ ఉదయం ఇవ్వాల్సిన పింఛన్ల సొమ్మును మూడో తేదీ మిట్ట మధ్యాహ్నం మండుటెండలో అవ్వాతాతలను సచివాలయాలకు పిలిచి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం ప్రభుత్వ ఖజానాలో ఉన్న వేలకోట్లు సొమ్ము జగన్ ఇష్టానుసారంగా తన సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పింఛన్ల పంపిణీకి నిధులు లేకుండా చేశారని ఆరోపించారు. చంద్రబాబు వల్లే పింఛన్ల పంపిణీ నిలిచిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయాన వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు.

దత్తసాయి మందిర కల సాకారం

మొగల్తూరు, ఏప్రిల్ 3 : మొగల్తూరులో దత్తసాయి మందిర నిర్మాణ కల భక్తులు సహకారంలో సాకారమైందని ఆలయ నిర్వాహకుడు శెట్టి మోహనరావు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఈ మందిర నిర్మాణం ప్రారంభించామన్నారు. బెంగళూరు దత్తపీఠం నుంచి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆలయానికి ఇచ్చిన చిన్న విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేసేవారమన్నారు. ఆలయంలో ప్రధాన విగ్రహాన్ని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న గుండ శ్రీనివాసరావు ఏర్పాటు చేయగా తదితర విగ్రహాలను పలువురు భక్తులు అందించారన్నారు. ఆలయం నిర్మాణానికి సహకరించిన దాతలు, వలంటీర్లు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉండి'లో 1,820 మందికి పింఛన్లు పంపిణీ

ఉండి/పెనుమంట్ర, ఏప్రిల్ 3:ఉండి మండలంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. మండలంలో మొత్తం 9,017మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా 1,820మందికి బుధవారం అందించామని అధికారులు తెలిపారు. మండలంలో రూ.2,62,19,500 బ్యాంకుల నుంచి నగదు రావాల్సి ఉండగా రూ.56 లక్షలు మాత్రమే వచ్చినట్టు సమాచారం. పెనుమంట్ర మండలంలో వృద్ధాప్య పింఛన్లు 8,470 మంది, డిజెబుల్ పర్సన్ 347 దివ్యాంగ పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో నగదు నిల్వ లేకపోవడంతో ఆరు గ్రామాల్లోనే పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభించారు. పెనుమంట్ర మండలంలో 4.27 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో పద్మజ తెలిపారు. మిగిలిన గ్రామాల్లో గురువారం అందిస్తామన్నారు.

సోమేశ్వరుడి నిత్యాన్నదానానికి రూ.1,01,116



విరాళం అందిస్తున్న దాత

భీమవరంటౌన్, ఏప్రిల్ 3: గునుపూడి పంచారామక్షేత్రమైన సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంనిర్వహించే నిత్య అన్నదాన ట్రస్టుకు గుడివాడకు చెందిన యామిజాల సాగర సుబ్బలక్ష్మి తన భర్త యామిజాల లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం రూ.1,01,116 విరాళం బుధవారం అందించారు. తొలుత దాతలు స్వామిని దర్శించుకోగా అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అందించారు.

రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ధాన్యం కొనాలి

ఆకివీడు, ఏప్రిల్ 3: అధికారులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్బీకే ఇన్‌చార్జిలు, టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, కస్టోడియన్ అధికారులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. తేమశాతం 17 దాటకూడదన్నారు. వ్యవసాయాధికారి ప్రియాంక, సివిల్ సప్లయి అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు తప్పనిసరి

నరసాపురం రూరల్, ఏప్రిల్ 3: నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ ప్రసాద్ అదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూశాఖల సిబ్బందితో కొనుగోళ్ళపై సమీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 17 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, సుమారు 1.6 లక్షల గోనె సంచులను సిద్ధంగా ఉంచామన్నారు. మండలం పరిధిలో ఎనిమిది రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తారని, ప్రతి వాహనాన్ని జియో ట్యాగింగ్ చేశామన్నారు. ఏవో కె.రాజశేఖర్, కె.జోసఫ్‌పాల్, శ్రీనివాస్, నవీన్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులకు పితాని పరామర్శ

పెనుమంట్ర, ఏప్రిల్ 3 :టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ మరణించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామానికి వెళ్లి కళావతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బూరుగుపల్లి రాఘవులు, గణపతినీటి రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అండగా నిలవండి.. ఆశీర్వదించండి : శివరామరాజు



ఎస్‌ఆర్‌పీఅగ్రహారంలో శివకు మహిళల హారతి

ఉండి, ఏప్రిల్ 3: తనకు అండగా నిలవండి ఆశీర్వదించండి అంటూ మాజీ ఎమ్మెల్యే, స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని చినపుల్లేరు, పెదపుల్లేరు, వాండ్రం, ఎస్ఆర్‌పీ అగ్రహారంలలో ఆయన ఆటోపై ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనను రెండుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేశానన్నారు. మరోసారి తనకు విజయాన్ని అందించాలని ఓటర్లను, మహిళలను, యువతీయువకులను కోరారు. అనంతరం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో పల్లెనిద్ర చేశారు. గ్రామస్థులు సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఉండి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, పార్టీ నాయకులు మోపిదేవి నాగ శ్రీనివాసరావు, బురిడి రవిబాబు, దవిశి శ్రీనివాస్, వత్సవాయి సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాల విద్యార్థుల రక్తదానం

నరసాపురం, ఏప్రిల్ 3 : నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌లో 15 మంది వైఎన్ కళాశాల విద్యార్థులు బుధవారం రక్తదానం చేశారు. 40 మంది విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రాగా హిమోగ్లోబిన్, రెడ్ బ్లడ్ సెల్స్ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. కళాశాల విద్యార్థులు రాజేష్, చిన్న, సతీష్ వర్మ, దివాకర్, వెంకట్ సంతోష్, ధర్మ, సాయి కృష్ణ, వంశీ కృష్ణ, తదితర 15 మంది విద్యార్థులు రక్తదానం చేశారు

సినీ గాయకుడు రాజుకు పితృవియోగం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 3: చిట్టవరానికి చెందిన సినీ గాయకుడు రాజుకు పితృవియోగం కలిగింది. రాజు తండ్రి నర్సింహమూర్తి(74) బుధవారం మృతి చెం దారు. ఆయన మృతికి చీఫ్ విప్ ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు, జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, సర్పంచ్ తాడి లక్ష్మణరావు సంతాపం తెలిపి రాజును పరామర్శించారు.

దుర్భాషలాడిన అధికారిని శిక్షించాలి

ఆకివీడు, ఏప్రిల్ 3: నగర పంచాయతీ అధికారి కులం పేరుతో తనను దూషించాడని సందీప్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలివి.. టీడీపీ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్న ఎలిచర్ల సందీప్ స్థానిక వెలంపేట రామాలయం వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ వచ్చి మాట్లాడుతూ సందీప్ అంటే నువ్వేనా అంటూ వైసీపీకి పనిచేయకుండా టీడీపీకి పనిచేస్తావా అంటూ కులంపేరుతో దూషిస్తూ, కర్రతో కొట్టేందుకు వచ్చాడన్నారు. ఆ అధికారి నుం చి తనకు రక్షణ కల్పించి కఠినంగా శిక్షించాలని కోరాడు. సందీప్‌కు మద్దతుగా టీడీపీ మండల-పట్టణ నాయకులు అండగా నిలిచారు.

పోలీసుల కవాతు



కోరుకొల్లులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలు

పాలకోడేరు, ఏప్రిల్ 3 : ఓటు హక్కు అనేది వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని కోరుకొల్లు, పాలకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, కుముదవల్లి గ్రామాలలో భద్రతాదళాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రజలకు ఓటు హక్కును వినియోగించుకునేలా, శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఏఎస్ఐ మోహనరావు, ఈవోపీఆర్‌డీ, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి ఆంజనేయులు, వీఆర్వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భారత జవాన్లకు మానవత అల్పాహారం

పెనుమంట్ర, ఏప్రిల్ 3 : పెనుమంట్ర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో భారత జవాన్లు మార్టేరులో ఎన్నికల సందర్భంగా కవాతు నిర్వహించారు. ఈమేరకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అల్పాహారం ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో మానవత మండల ప్రెసిడెంట్ బాణాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ మానవత మూర్తి, సెక్రెటరీ బండి ప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసులు మురళీకృష్ణ, పడాల రామచంద్రారెడ్డి, వంశీ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 3 :ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.అనుపమ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారులు శ్రీదేవి ప్రధాన కథకురాలిగా చెప్పిన బుర్రకథలో విజయకుమార్ హాస్యం, గణేష్ వచనంతో ఓటు హక్కుపై బుర్రకథ వినిపించారు. ఈవోపీఆర్‌డీ డి.కె.వైభవతి, గ్రామ కార్యదర్శి లింగం సత్యనారాయణ, కె.శ్రీనివాస్, ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాల విద్యార్థుల మానవహారం

ఓటు హక్కు వజ్రాయుధం

ఆకివీడు రూరల్, ఏప్రిల్ 3:ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఓటు హక్కు వజ్రాయుధమని పలువురు వక్తలు అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కోసం బుధవారం దుంపగడప వీవీగిరి ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ సుజాత, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.